## రిమ్స్‌లో ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం

**పరిశీలించిన డైరెక్టర్ జైసింగ్ రాథోడ్**



అడ్మిషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఎదులాపురం, ఆగస్టు 27 : ఆదిలాబాద్ రిమ్స్‌లో ఆల్ ఇండియా కోటా ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. జాతీయ వైద్య మండలి ఆలిండియా కోటాలో భాగంగా రిమ్స్‌కు 15 మంది విద్యార్థులను కేటాయించగా మంగళవారం ముగ్గురు విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్ తీసుకున్నారు. సిబ్బంది విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ ప్రక్రియను రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పరిశీలించారు. ఈ నెల 29 వరకు విద్యార్థులు కళాశాలలో చేరవచ్చని తెలిపారు.

## రైల్వే ప్రాజెక్టుల సర్వే త్వరగా పూర్తి చేయాలి



దక్షిణ మధ్య రైల్వే జీఎంతో మాట్లాడుతున్న ఎంపీ. జీ నగేశ్

ఆదిలాబాద్, ఆగస్టు 27 ( నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని రైల్వే ప్రాజెక్టుల సర్వే పనులను త్వరగా పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌ను ఆదిలాబాద్ ఎంపీ జీ నగేశ్ కోరారు. మంగళవారం సికింద్రాబాద్ రైల్వే నిలయంలో జీఎంను కలిసి మాట్లాడారు. సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలని, ఆర్మూర్, ఆదిలాబాద్ వయా నిర్మల్, ఆదిలాబాద్, గడ్‌చాందూర్, ముథ్కేడ్, ఆదిలాబాద్, పిప్పల్‌కోటి డబుల్ లింక్, కుమ్రంభీ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన గేట్ –71 వద్ద ఆర్‌వోబీ పనులు పూర్తి చేయాలని కోరినట్లు ఎంపీ తెలిపారు. ఇందుకు రైల్వే జీఎం సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.



కుభీర్ : స్వీట్లు తినిపించుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

## ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరుపై హర్షం

**పటాకులు కాల్చి, స్వీట్లు పంచిన బీఆర్ఎస్ శ్రేణులు**



భైంసా: స్వీట్లు పంచుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు



ఉట్నూర్ : స్వీట్లు తినిపిస్తున్న మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు

భైంసా /కుభీర్/ఉట్నూర్/ఆగస్టు 27 : నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో సంబురాలు నిర్వహించారు. నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని గాంధీగంజ్ వద్ద బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులు స్వీట్లు పంచిపెట్టి, పటాకులు కాల్చారు. ఈ సంబురాల్లో ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు విలాస్ గాదేవార్, రావుల పోశెట్టి, సురేశ్, నసీర్ బేగ్, పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు. కుభీర్‌లో నిర్వహించిన సంబురాల్లో మాజీ వైస్ ఎంపీపీ మొహియొద్దీన్, ఇక్రమొద్దీన్, దొంతుల గంగాధర్, జీ.కాశీనాథ్, డాక్టర్ పోశెట్టి, దత్తు, నర్సింహులు, దొంతుల లింగన్న, దేవన్న, దత్తుసింగ్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని స్థానిక అంబేద్కర్ చౌక్‌లో నిర్వహించిన సంబురాల్లో మాజీ ఎంపీపీ, ఇన్‌చార్జి మండల అధ్యక్షుడు పంద్ర జైవంత్‌రావు, మాజీ సర్పంచ్ బొంత ఆశారెడ్డి, సెడ్మకి సీతారాం, ముజీబ్‌ఖాన్, సత్తన్న, భూమన్న, బాపురావు, అలీ, రాములు, జాడి వెంకటేశ్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్, బీజేపీలకు చెంపపెట్టు



నిర్మల్, ఆగస్టు, 27 (నమస్తే తెలంగాణ) ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ రావ డం హర్షనీయమని బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ సమన్వయకర్త రామ్ కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఏడాదిన్నర కాలంగా టీవీ సీరియల్ మాదిరిగా విచారణ పర్వాన్ని కొనసాగించి ఐదు నెలలుగా జైలులో నిర్బంధించి ఒక మహిళ అని కూడా చూడకుండా బీజేపీ చేసిన నీచ రాజకీయానికి మంగళవారం సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పు చెంప పెట్టులాంటిదన్నారు. జాతీయ రాజకీయాల్లో కేసీఆర్‌ను ఎదుర్కోలేక ఆయన కూతురు కవితను నిర్బంధంలోకి తీసుకొని మానసికంగా, నైతికంగా దెబ్బతీయాలని బీజేపీ కుట్రలకు పాల్పడిందని ఆరోపించారు. దీనికి కాంగ్రెస్ పార్టీ కూడా వంతపాడిందన్నారు. సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడం ద్వారా న్యాయవ్యవస్థపై ప్రజలకు మరోసారి మరింత నమ్మకం కలిగిందన్నారు.

# భూములివ్వాలని గోస పెట్టొద్దు

**రేణుక సిమెంటు ఫ్యాక్టరీ కోసం అధికారులు వేధించొద్దు**

- ఎకరాకు రూ. 40 లక్షలు, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలి
- కలెక్టరేట్ ఎదుట ఆదిలాబాద్ రూరల్, జైనథ్ మండలాల్లోని 8 గ్రామాల రైతుల ధర్నా



ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న 8 గ్రామాల రైతులు

ఆదిలాబాద్, ఆగస్టు 27 ( నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయి వద్ద ఏర్పాటు చేయనున్న రేణుక సిమెంట్ ఫ్యాక్టరీకి భూములివ్వాలంటూ రెవెన్యూ అధికారులు వేధింపులు మానుకోవాలని ఆదిలాబాద్ రూరల్, జైనథ్ మండలాలకు చెందిన 8 గ్రామాల రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. రైతు సంఘాల నాయకులతో కలిసి రామాయి, యాపల్‌గూడ, యశ్వంత్ గూడ, కొత్తగూడ, రాములు గూడ, అడ్డగుట్ట, రాంపూర్, పార్డీ గ్రామాల రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ కోసం 650 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, నోటిఫికేషన్‌లో భూములకు చెందిన హద్దులు సరిగా చూపకుండా, సబ్ డివిజన్ సైతం సరిగా నిర్వహించలేదని తెలిపారు. భూ సేకరణ విషయంలో సర్వేయర్‌తో రెవెన్యూ అధికారులెవరూ రావడం లేదని, ప్రజాభిప్రాయ సేకరణ, గ్రామసభలు నిర్వహించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల్లో రైతుల భూములు కొలతలు తక్కువగా చూపారన్నారు.

### ఏడేళ్ల క్రితం కంటే తక్కువ ధరకు అడుగుతుండ్రు..

తాతల కాలం నుంచి ఈ భూములను సాగు చేసుకుంటూ ఉ పాధి పొందుతున్నామని పరిశ్రమ కోసం అధికారులు తక్కు వ ధరకు భూములు తీసుకుంటే ఎలా బతకాలని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 2017–18 సంవత్సరంలో సిమెం ట్ ఫ్యాక్టరీకి 110 ఎకరాలు సేకరించగా ఎకరాకు రూ. 9.25 లక్షలు చెల్లించారని, ఇప్పుడు ఆదిలాబాద్ ఆర్డీవో, సిబ్బంది ఎకరాకు రూ.8.50 లక్షలకు ఒప్పుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం భూముల విలువ ఎకరాకు రూ.40 లక్షలు ఉందని, ఆ ధర చెల్లించాలని, నిర్వాసితుల కుటుంబాలకు ఇంటికో ఉద్యోగం కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ ఏర్పాటుతో కలిగే నష్టాలను సైతం తెలియజేయలేదని, పరిశ్రమతో సాత్నాల ప్రాజెక్టు నీరు పంటలకు అందే పరిస్థితి లేదని తెలిపారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి గ్రామసభలు నిర్వహించాలని, రైతులకు న్యాయం చేసి, మౌలిక వసతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఎకరం భూమికి రూ.8.27 లక్షలే ఇస్తారట..



సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు విషయంలో రైతులకు న్యాయం చేయాల్సిన రెవెన్యూ అధికారులు ప్రైవేట్ పరిశ్రమ యాజమాన్యానికే అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. 4 తరాలుగా సాగు చేస్తున్న భూములకు తక్కువ ధర చెల్లించి అంగట్లో సరుకులు కొనేందుకు ప్రయత్నిస్తున్నారు. 8 గ్రామాల ప్రజలు భూములు కోల్పోతున్నా అధికారులెవరూ గ్రామాలకు రాలేదు. రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా, గ్రామసభలు నిర్వహించకుండా బలవంతంగా భూములు లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒక్కో రైతును ఆర్డీవో కార్యాలయానికి పిలిపించుకుని భూములు పరిశ్రమకు అప్పగించాలని బెదిరిస్తున్నారు. ఎకరాకు రూ. 8.27 లక్షలు ఇస్తామని చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు తీరు సరిగా లేదు.

**- రమేశ్, రైతు, యాపల్‌గూడ**

### మమ్మల్ని దొంగల్లా చూస్తున్నారు..



నాకు గ్రామంలో నాలుగు ఎకరాల భూమి ఉంది. రేణుక సిమెంటు పరిశ్రమకు భూమి కావాలంటూ ఇటీవల సర్వే చేశారు. ఆర్డీ వో, తహసీల్దార్ ఎవరూ గ్రామానికి రాలేదు. నాతో మాట్లాడలేదు. మా కుటుంబానికి జీవనాధారమైన భూమి ఎకరానికి రూ.8.27 లక్షలు తీసుకుని ఏమి చేసుకోవాలి. ఈ ధరకు ఎక్కడ భూమి దొరకదు సాగు భూమి లేకపోతే ఉపాధి ఉండదు. భూముల అప్పగింత వ్య వహారంలో రెవెన్యూ అధికారులు రైతులను దొంగల్లా కా ర్యాలయానికి పిలిచి భూములు అప్పగించాలని బలవంతం చేస్తున్నారు. ఫ్యాక్టరీకి భూముల సేకరణ వ్యవహారంతో లావాదేవీలు జరుగుతున్నట్లు అనుమానం వస్తున్నది.

**- బేత గంగన్న, రైతు, రామాయి**

### రైతులకు న్యాయం జరిగే దాకా పోరాటం..



రెవెన్యూ అధికారులు భూములు కోల్పోయే రైతులతో ఎలాంటి సమావేశాలు ఏర్పాటు చేయకుండా, గ్రామసభలు నిర్వహించకుండా అభిప్రాయ సేకరణ జరగకుండా బలవంతంగా సాగు భూములను తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. రైతులకు ఈ భూములే జీవనాధారం, ఎకరాకు రూ.8.27 లక్షల ఇస్తామని అధికారులు అంటున్నారు. వాస్తవానికి ఈ భూముల మార్కెట్ విలువ ఎకరాకు రూ. 40 నుంచి రూ. 50 లక్షల ధర ఉంటుంది. రైతులకు మార్కెట్ ధర చెల్లించి, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలి. రెండు సంవత్సరాల్లో పరిశ్రమ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వాలి. అధికారుల సానుకూలంగా స్పందించకపోతే అన్ని రాజకీయ పార్టీలతో కలిసి రైతులకు న్యాయం జరిగే దాకా పోరాడుతాం.

**- బండి దత్తాత్రి, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్**




గుడిహత్నూర్ బస్టాండ్ ఎదుట రాస్తారోకో చేస్తున్న ఆదివాసీ నాయకులు

## ఏజెన్సీలో బంద్ విజయవంతం

- హక్కులను పకడ్బందీగా అమలు చేయాలి
- ఆదివాసీ నాయకుల డిమాండ్

నమస్తే నెట్‌వర్క్, ఆగస్టు 27 : ఆదివాసుల కోసం ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ వేయాలని, ఐటీడీఏలో బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, జీవో నంబర్‌ను 3ను కొనసాగించాలని, లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, తదితర డిమాండ్లతో ఆదివాసీ సంఘం తుడుం దెబ్బ, తదితర ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో అన్ని మండలాల్లో వ్యాపారులు దుకాణాలు మూసి వేసి బంద్‌కు సహకరించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం, గుడిహత్నూర్‌లో బస్టాండ్ల ఎదుట ఆదివాసీ సంఘం రాష్ట్ర, కమిటీ నాయకులు రాస్తారోకో చేశారు. ఇంద్రవెల్లిలో బైక్ ర్యాలీ తీసి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌కు వినతిపత్రం అందించారు. నార్నూర్, గాదిగూడ, బజార్‌హత్నూర్ మండలాల్లో కుమ్రం భీం విగ్రహాల వద్ద నిరసన తెలిపారు. ఆదివాసుల హక్కులు, చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తు ఆందోళన చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. నిరసన కార్యక్రమాల్లో తుడం దెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ గోడం గణేశ్, ఆదివాసీ తొమ్మిది తెగల సమన్వయకర్త కోట్నాక్ బారిక్‌రావ్, తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి సోయం రాందాస్, గౌరవ అధ్యక్షుడు జుగ్నాక్ భరత్, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు గేడం భరత్, ఆదివాసీ బిర్ద్ గోండ్ తోటి సేవా సంఘం జిల్లా అధ్యక్షులు నైతం శేఖర్, రాయిసిడాం జంగు, మెస్రం నాగోరావ్, నైతం రమేశ్, ముకుంద్‌రావు, నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

## నవజాత శిశువుల మరణాలను అరికట్టాలి



ఉట్నూర్ దవాఖానలో నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐసీఎంఆర్ కేంద్రం బృందం సభ్యులు

ఎదులాపురం,ఆగస్టు 27: నవజాత శిశువుల మరణాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఐసీఎంఆర్(ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) కేంద్ర బృందం సూచించింది. ఆదిలాబాద్ జిల్లాలో నవజాత శిశు మరణాలపై సంకల్ప్ పథకంలో భాగంగా అధ్యయనంలో రాష్ట్ర బృందంతో కలిసి కేంద్ర బృందం సభ్యులు మంగళవారం రిమ్స్ ఎస్ఎన్సీయూ, కాన్పుల విభాగం, కంగారూ మదర్ కేర్ యూనిట్లను పరిశీలించింది. అనంతరం రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యులతో సమావేశాన్ని నిర్వహించారు. నవజాత శిశువుల మరణాల సంఖ్య, కారణాలు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్, ఉట్నూర్ దవాఖానల పర్యవేక్షకులు డాకర్లు అశోక్, ఉపేందర్, పీఓడీటీటీ రాథోడ్ నరేందర్, ఎస్ఎన్సీయూ నోడల్ అధికారి అనంతరావు, వైద్యులు తిరుమల్‌రెడ్డి, హేమలత, మృదుల్, ఓబీజీ బాధ్యురాలు పద్మిని, డీఐవోవైసీ శ్రీనివాస్, కేంద్ర, రాష్ట్ర ప్రతినిధులు అమ్మిన్, ఎస్. ధనిగైనాథన్ ఉన్నారు.

**ఉట్నూర్, ఆగస్టు 27 :** ఉట్నూర్‌లోని దవాఖానలోని నవజాత శిశువుల ప్రత్యేక విభాగాన్ని ఐసీఎంఆర్ బృందం సభ్యులు, సైంటిస్ట్ అంబ్లింగ్, డాక్టర్ మనోజ్ కుమార్ దాస్ సందర్శించారు. దవాఖానలో వసతులు, సిబ్బంది కొరత, దవాఖాన పరిధిలోని ప్రజల స్థితి గతులపై అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ వైద్యాధికారి మనోహర్, దవాఖాన సూపరింటెండెంట్ ఉపేందర్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

## ప్రాణం తీసిన చేపల వేట

- పొచ్చర వాగులో మునిగి ముగ్గురు అన్నదమ్ముల మృతి
- మరణంలోనూ వీడని బంధం
- మృతుల స్వగ్రామం మహారాష్ట్ర నాందేడ్ జిల్లా నవీ అబాదిలో విషాదం



విజయ్(ఫైల్)



అక్షయ్(ఫైల్)



వాగులో నుంచి మృతదేహాలను వెలికి తీస్తున్న పోలీసు బృందాలు

ఆదిలాబాద్, ఆగస్టు 27 : ( నమస్తే తెలంగాణ) : చేపలవేటకు వెళ్లిన మహారాష్ట్రకు చెందిన ముగ్గురు అన్నదమ్ములు మృతి చెందిన విషాద ఘటన ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం జరిగింది. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా నవీ అబాదికి చెందిననాగుల్‌వాడే విజయ్(28), నాగుల్‌వాడే ఆకాశ్ (26), నాగుల్ వాడే అక్షయ్ ( 24) తాంసి మండలం బండల్‌నాగాపూర్‌లో వారి బంధువు శ్రీనివాస్ ఇంటికి వచ్చారు. మంగళవారం ముగ్గురు యువకులు చేపలు పట్టేందుకు ఆదిలాబాద్ రూరల్ మండలం పొచ్చర వాగులోకి వెళ్లారు. వాగులో దిగి చీరతో చేపలు పడుతుండగా లోతు తెలియకపోవడంతో అక్షయ్ వాగులో మునిగిపోయాడు. అతడిని కాపాడేందుకు ఆకాశ్, విజయ్ ప్రయత్నించగా వారు సైతం నీటిలో మునిగిపోయారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, డీడీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని 5గంటల పాటు శ్రమించి ముగ్గురు యువకుల మృతదేహాలను వెలికితీశారు. పోస్టుమార్టం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఇందులో విజయ్‌కి భార్య, కుమారుడు ఉన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు మరణించడంతో వారి స్వగ్రామం నాందేడ్ నవీ అబాదీలో విషాదఛాయలు అలుముకున్నాయి.




భైంసా డిపో ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కండక్టర్లు

## సమస్యలు పరిష్కరించాలి

**ఆర్టీసీ డిపోల ఎదుట డ్రైవర్లు, కండక్టర్ల నిరసన**

నిర్మల్ అర్బన్/ భైంసా, ఆగస్టు 27: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నిర్మల్, భైంసా ఆర్టీసీ డిపోల ఎదుట డ్రైవర్లు, కండక్టర్లు, కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీన ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వ ఉద్యోగులతో సమాన హక్కులు, వేతనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ బాండ్ డబ్బులు వెంటనే విడుదల చేయాలన్నారు. మహాలక్ష్మి పథకంతో బస్సులో రద్దీ పెరిగిందని రద్దీకి అనుగుణంగా బస్సులు పెంచాలన్నారు. కండక్టర్లు, డ్రైవర్ల నియామకాలు చేపట్టి పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించలేదంటే అక్టోబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సామూహిక దీక్షలు చేపడుతామన్నారు. నిరసన కార్యక్రమాల్లో కార్మిక సంఘాల నాయకులు, డ్రైవర్లు, ఆర్టీసీ కండక్టర్లు గంగయ్య, స్వరూప్, గజ్జారాం, సుధాకర్, బాబు, ముత్యం, మొహినొద్దీన్, పోతన్న, సుధాకర్ ఉన్నారు.

## షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

నిర్మల్ అర్బన్, ఆగస్టు 27 : రైతులకు షరతులు లేకుండా రుణమాఫీని వెంటనే అమలు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేసి ఆర్డీవో రత్న కల్యాణికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయకుండా రేషన్ కార్డు, ఆధార్ కార్డులో తప్పులు ఉన్నాయని రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరి కాదన్నారు. వెంటనే అర్హులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాడెకార్ లక్ష్మణ్, భూక్యా రమేశ్, అనంత్‌రావు, రైతులు తదితరులున్నారు.




నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

## లైబ్రరీ సమస్యలు పరిష్కరిస్తాం

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

ఎదులాపురం, ఆగస్టు 27: పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల సౌకర్యార్థం ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయంలో సమస్యలు పరిష్కరించి, వసతులు కల్పిస్తామని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని లైబ్రరీని సందర్శించారు. భవనం స్లాబ్‌కు ఉన్న పీవోపీ ఊడిపోతున్నదని, డోర్లు, కిటికీలు సక్రమంగా లేవని, స్టడీ మెటీరియల్, కరెంట్, సరిపడా కుర్చీలు లేవని పోటీ పరీక్షల అభ్యర్థులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి నెలా డీపీవో నుంచి ప్రభుత్వ పరంగా అందించే సంచికలను సక్రమంగా పంపిణీ చేయాలని ఫోన్ ద్వారా అధికారులను ఆదేశించారు. వారం రోజుల్లో సమస్యలను పరిష్కరించకపోతే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. గ్రంథాలయ కార్యదర్శి బుగ్గరెడ్డి, లైబ్రేరియన్లు శ్రీనివాస్, సతీశ్, సిబ్బంది ఉన్నారు.



గ్రంథాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా